

వీధికుక్కలకు వింత రోగాలు!

- జుట్టు ఊడిపోయి.. పుండ్లు పట్టి వీధుల్లో తిరుగుతున్న కుక్కలు
- భయాందోళనలో స్థానికులు

మరిన్ని వివరాలు 6వ పేజీలో...



ఆదిలాబాద్ ఆత్మ చైర్మన్‌గా గిమ్మ

- త్వరలోనే సంతోష్ నియామకం



గిమ్మ సంతోష్

ఆదిలాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఆత్మ చైర్మన్‌గా గిమ్మ సంతోష్‌ను నియమించేందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం చర్యలు చేపట్టింది. జైనథ్ మండలం గిమ్మ గ్రామానికి చెందిన సంతోష్ పేరును నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ఖరారు చేశారు. గత పక్షం రోజుల క్రితమే జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేశారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆయన నియామకం అర్థాంతరంగా నిలిచి పోయింది. తాజాగా స్థానిక ఎన్నికలకు బ్రేక్ పడడంతో ఎన్నికల కోడ్‌ను ఎత్తివేశారు. దీంతో ఆయన నియామకం దాదాపు ఖరారైనట్లుగానే కనిపిస్తుంది. త్వరలోనే జిల్లా కలెక్టర్ నియామక ఉత్తర్వులను జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తుంది. కంది శ్రీనివాస్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉంటూ ఆదిలాబాద్ నియోజకవర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న సంతోష్‌కు ఆత్మ చైర్మన్ పదవి దక్కడం ఖాయంగానే కనిపిస్తుంది.

పొచ్చెరలో రామ నామ సంకీర్తన

బోథ్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామంలో శుక్రవారం రామాలయంలో రామనామ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన శివానంద భారతి రామ నామంలో ఉన్న గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. రామనామ స్మరణతో ఎంతటి కష్టాలైన దూరమవుతాయన్నారు. ఎంతో మధురమైందని ఆ నామాన్ని స్మరిస్తే పుణ్యం చేపడుతుందన్నారు. సాటి మానవుడిని జీవుల పైన దయతో ఉండాలన్నారు. కార్యక్రమంలో పొచ్చెర కౌటబి తేజాపూర్ గ్రామాల భక్తులు రామనామ స్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారతి స్వామితో శాంతమాత పాల్గొన్నారు.



ఆలయంలో సంకీర్తనలు పాడుతున్న భక్తులు



పోస్టర్లను విడుదల చేస్తున్న బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు చాట్ల పోశవ్వ

తెలంగాణలో వ్యవసాయం తర్వాత పెద్దది బీడీ పరిశ్రమనే..

- రాష్ట్ర అధ్యక్షురాలు చాట్ల పోశవ్వ

నేరడిగొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం రెండవ రాష్ట్ర మహాసభ పోస్టర్లను శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు చాట్ల పోశవ్వ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శని. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే భారీ ర్యాలీ బహిరంగ సభకు వేలాదిమంది బీడీ కార్మికులు, ప్యాకర్లు, బట్టి, చాటన్, టేకేదారులు తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత అతిపెద్ద పరిశ్రమ బీడీ పరిశ్రమేనని, ఈ పరిశ్రమపై 8లక్షల మంది కార్మికులు పనిచేస్తూ జీవనం గడుపుతున్నారన్నారు. ఇందులో ఎక్కువగా మహిళలు, నిరుపేదలు బహుజన, సామాజిక వర్గాలకు చెందిన వారే ఉన్నారని, ఈ కార్మికుల శ్రమ ఫలితం రోజుకు వంద కోట్ల బీడీలు తయారవుతాయన్నారు. బీడీ కార్మికులకు ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రూ.4016 జీవన్ భృతి ఇచ్చేవరకు ఉద్యమం పోరాటం చేస్తామన్నారు. జిల్లా నాయకురాలు జాదవ్ శాంతి, లంగోరి లక్ష్మి, ఎంపులూరి శ్రీలత, కొక్కులవార్ భూపతి, బాణావత్ వసంతరావు, జాదవ్ కపిల్ దేవ్, రాథోడ్ వసంత్ రావ్, తదితరులు ఉన్నారు.

'రిజర్వేషన్ల పేరిట బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్'

నేరడిగొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికలు నిర్వహించాలని ఆలోచన లేకపోవడంతోనే రిజర్వేషన్ల పేరిట డ్రామాలు ఆడుతోందని బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా నాయకుడు మజర్ అన్నారు. రిజర్వేషన్ల స్టే పై ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రిజర్వేషన్ల పేరిట బలహీన వర్గాలను మోసం చేస్తోందన్నారు. 22 నెలల కిందటే బీసీ రిజర్వేషన్ గురించి ప్రస్తావించిన రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాకుండా గల్లీలో ఎందుకు కొట్లాడుతున్నారని ప్రశ్నించారు. 22 నెలల సమయంతో ఢిల్లీలో ఫలితం కనిపించేది కాదా? అని ప్రశ్నించారు. స్థానిక ప్రజలు కాంగ్రెస్ ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పసిగట్టిన సీఎం, ఎన్నికలు ఆపాలనే ఇలాంటి డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు.



- జిల్లాలో పర్యటించనున్న ఏఐసీసీ పరిశీలకుడు
- డీసీసీ రేసులో నలుగురు కాంగ్రెస్ నేతలు
- పార్టీ పదవుల కోసం పోటాపోటీ ప్రయత్నాలు
- స్థానిక ఎన్నికలతో డీసీసీకి పెరిగిన ప్రాధాన్యత

డీసీసీ పీఠం.. ఎవరిది?

మళ్లీ తెరపైకి వస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడి ఎన్నిక

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి (డీసీసీ).. నియామకంపై పార్టీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టిని సారిస్తోంది. గతంలో డీసీసీ ఎంపికకు ప్రయత్నాలు జరిగినా.. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో డీసీసీ కోసం నేతలంతా పోటాపోటీ ప్రయత్నాలు చేస్తున్నారు. గత మూడేళ్లుగా జిల్లాలో డీసీసీ పదవి ఖాళీగానే కనిపిస్తోంది. నాయకత్వం లేకుండానే 2023 అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024 పార్లమెంట్ ఎన్నికలను నెట్టుకొచ్చారు. కానీ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో డీసీసీ ఎంపికపై అధిష్ఠానం అంతగా ఆసక్తి చూపలేదు.

ఆదిలాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం స్థానిక ఎన్నికల హడావుడి మొదలు కావడంతో మళ్లీ డీసీసీ ఎన్నిక తెరపైకి వస్తుంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ నిర్ణయానికి వ్యతిరేకం గా పనిచేశాడన్న ఆరోపణలతో మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్‌పై అధిష్ఠానం సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. దీంతో అప్పటి నుంచి జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఖాళీగానే కనిపిస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్న పార్టీ అధ్యక్షుని నియమకాన్ని చేపట్టక పోవడం పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో పార్టీని ముందుకు నడిపించే సరైన నాయకత్వం లేకపోవడంతో పార్టీ గాడితప్పుతుందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.



ముఖ్య నేతలతో సమీక్ష

ఏఐసీసీ పరిశీలకుడు అజయ్‌సింగ్‌తో పాటు టీపీసీసీ ఆర్గనైజర్స్ ఎం.అనిల్ కుమార్ యాదవ్, సీహెచ్. రాంభూపాల్, లకావత్ ధన్వంతి, గడ్డం చంద్రశేఖర్ రెడ్డిలు జిల్లాలో పర్యటించి ముఖ్యనేతలతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నేతల మధ్య సమన్వయం కుదిరించి డీసీసీ ఎంపికకు మార్గం సుగమం చేయనున్నారు. అయితే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నేతలు రెండు మూడు వర్గాలుగా విడిపోయి పని చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులతో నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరడం కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో

(తరువాయి 6వ పేజీలో....)

మద్దతు ఎవరికో?!

గత కొంత కాలంగా డీసీసీ పీఠంపై జిల్లా నేతలు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. కాని పార్టీ అధిష్ఠానం మద్దతు ఎవరికి దక్కుతుందో?నన్న చర్చ జోరుగా సాగుతోంది. ఎవరికి వారే ధీమాను వ్యక్తం చేస్తున్న చివరికి పార్టీ అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ కానుంది. డీసీసీ రేసులో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావు, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, తలమడుగు మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి పేర్లతో పాటు మరికొంత మంది నేతల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అలాగే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పేరును కూడా పరిశీలనలోకి తీసుకునే అవకాశాలు లేకపోలేదంటున్నారు. అయితే ఇప్పటికే పార్టీ పదవుల్లో కొనసాగుతున్న వారికి అవకాశం ఇవ్వడం కొంత కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాని అందరిని కలుపుకొని పార్టీని ముందుకు నడిపించే సత్తాఉన్న నేతలకే డీసీసీ పీఠం దక్కేఅవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ఓట్ చోరీపై జూమ్ మీటింగ్

ఆదిలాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఓట్ చోరీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్న ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాలతో అసెంబ్లీ నియోజక వర్గంలో ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల చోరీ కేవలం బిహార్‌లో మాత్రమే కాకుండా ఉత్తరప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో కూడా జరిగిందన్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి పత్రాలపై సంతకాల సేకరణ చేసి బీజేపీ విధానాలను ఎండగట్టాలని శ్రేణులకు సూచించారు. సంతకాలు పూర్తి చేసిన పత్రాలను రేపటిలోగా క్యాంపు కార్యాలయంలో అందించాలని ఆయన సూచించారు.

'మళ్లీ బీఆర్ఎస్ పార్టీలోకి తిరిగి వస్తున్నారు'

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీల్లో చేరిన వారికి సరైన గౌరవం లేక మళ్లీ తిరిగి బీఆర్ఎస్‌లోకి వలస వస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో బీజేపీలో నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను మోసం చేసి గద్దెనెక్కాయని ఆరోపించారు. అధికారం వచ్చిన తర్వాత వారికి ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదని ఆయన ఈ సందర్భంగా మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రహ్లాద్, రాజన్న, దమ్మపాల్, రఫీక్, సుధీర్, దయాకర్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ పట్టణంలో రాస్తారోకో నిర్వహిస్తున్న నేతలు

బీసీ రిజర్వేషన్‌ల తర్వాతే ఎన్నికలు జరపాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులడు చిక్కాల దత్తు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు ఎవరు అడ్డుపడుతున్నారో బీసీలకు తెలుసని, కుట్రలు పన్నితే తగిన బుద్ధి చెబుతామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో బీసీ రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ వేసిన వారి దిష్టిబొమ్మతో ప్రదర్శన నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘ భవనం నుంచి ప్రారంభమైన ప్రదర్శన తెలంగాణ చౌక్ వరకు చేరుకుంది. పోలీసులు వారిని దిష్టిబొమ్మ దహనం చేయకుండా అడ్డుకోవడంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. అనంతరం రహదారిపై బైటాయించి పిటిషన్లు వేస్తున్న వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీసీ రిజర్వేషన్‌ల సాధనే లక్ష్యంగా సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పోరాడుతున్నారని జిల్లా అధ్యక్షులు దత్తు తెలిపారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌ను ఇచ్చిందన్నారు. దానికి అనుగుణంగా అసెంబ్లీలో జీవో చేసి గవర్నర్‌కు పంపితే ఆయన వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్‌లతో స్థానిక సంస్థలకు వెళ్తే జీర్ణించుకోలేక హైకోర్టులో కేసు వేశారని, పిటిషన్ల వెనక ఎవరున్నారో బీసీలకు తెలుసన్న ఆయన తగిన సమయంలో వారికి గుణపాఠం తప్పదన్నారు. బీసీ నినాదం గట్టిగా ఉందని, రిజర్వేషన్ వచ్చే వరకు జాతీయ నాయకత్వం పిలుపు మేరకు మరిన్ని ఆందోళనలు చేపడతామని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి కలల శ్రీనివాస్, అంజేష్, శ్రీనివాస్, అశోక్, రాము, చందు, సామల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు



సుంకిడి అంతరాష్ట్ర రహదారిపై బీసీ సంఘాల నాయకులు

● ఉట్నూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాలు..

ఉట్నూర్: రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం చట్టబద్ధత కల్పిస్తామంటూ జీవోను తీసుకువచ్చి 42 శాతం బీసీ రిజర్వేషన్ ఇస్తున్నామంటూ బీసీలకు మోసం చేశారని పేర్కొంటూ బీజేపీ ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఉట్నూర్ ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పిస్తున్నామంటూ ప్రకటించి ఎన్నికలకు వెళ్లడం అనంతరం అగ్రకులానికి చెందిన నాయకులు హైకోర్టుకు వెళ్లడం కోర్టు స్టే విధించడం ఇదంతా కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలను తప్పుతోవ పట్టించడం అని బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రకులాలకు చెందిన నాయకులు ఎంత మంది మినిస్టర్లు ఉన్నారని, బీసీలకు సంబంధించిన మంత్రులు ఎంత మంది ఉన్నారో దీనికి నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీల పట్ల ఎంత గౌరవం ఉందో కనబడుతుందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్

మరిన్ని వివరాలు 6లో...



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసిన బుర్కపల్లి గ్రామస్థులు

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గల గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే నివాసంలో బజార్ హత్నూర్ మండలంలోని బుర్కపల్లి గ్రామస్థులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గల గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నానని అన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

- మండల వైద్యాధికారి సర్పరాజ్
- వన్నాట్ ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని వన్నాట్ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి సర్పరాజ్ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం జరిగిందని, పిల్లలకు సర్ది, జలుబు, గజ్జి ఉన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి తగు మందులను ఇవ్వడం జరిగిందన్నారు. పాఠశాల చుట్టూ ఉన్న పరిసరాలను, వంట గది, ఆహార పదార్థాలను, కూరగాయలను శుభ్రంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆరోగ్య సహాయకులు పవర్ ప్రేమ్ సింగ్, స్కూల్ హెడ్ మాస్టర్ వెంకటేశ్వర్ రావు, కల్యాణ్ చక్రవర్తి, వార్డన్ మేడం ప్రతిభ, మారుతి, ఆశా కార్యకర్త సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆదుకుంటున్న అంబులెన్స్‌లు

● ఉట్నూర్ ఏజెన్సీలోని గిరిజన గ్రామాలకు అందుతున్న సత్వర వైద్య సేవలు 7వ పేజీలో...

నెమలిని వేటాడిన ముగ్గురిపై కేసు

● వివరాలు 6వ పేజీలో....

విద్యార్థులను బడికి పంపే బాధ్యత తల్లిదండ్రులదే..

- ఐటీడీఏ జీసీడీవో ఛాయాదేవి

తలమడుగు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సెలవులు ముగిసిన తర్వాత వెంటనే విద్యార్థులను బడికి పంపే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఐటీడీఏ జీసీడీవో ఛాయాదేవి కోరారు. శుక్రవారం మండలంలోని ఉమ్రి ఆశ్రమ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ బాలికల విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అంతేకాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ఇంటి వద్ద ఉంచకుండా సెలవులు ముగిసిపోగానే వెంటనే పంపించాలన్నారు. అనంతరం హాస్టల్ తనిఖీ చేసి విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోసాయి గ్రామానికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంలో ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ఇంకా పాఠశాలకు హాజరు కాని విద్యార్థులకు సంబంధించిన తరగతి ఉపాధ్యాయులు రప్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం కోసాయి గ్రామాన్ని సందర్శించి అక్కడ ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు కలసి మీ పిల్లలను తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరారు. దీంతో స్పందించిన తల్లిదండ్రులు తీసుకొని వస్తాం అని చెప్పడం జరిగింది.



కోసాయి గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఛాయాదేవి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొగాకు వాడకం ప్రమాదకరం

● జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సైకాలజిస్ట్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పొగాకు వాడకం ప్రమాదకరమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆదేశాల మేరకు పొగాకు రహిత విద్యా సంస్థల ఏర్పాటుకై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పొగాకు రహిత యువతకై ప్రచారం 3.0లో భాగంగా పట్టణంలోని బాలక్ మందిర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నం.2లో అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం మూలంగా కేన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడం నేరమన్నారు. కోట్పా చట్టం ప్రకారం మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మడం, కొనిపించడం నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మెరుగు సుధాకర్, జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుబీర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన ఉల్గా ప్రేమల ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ముధోల్ నియోజక వర్గ సమన్వయకర్త డా. కిరణ్‌కొమ్రేవార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్, నిగ్వా ఎంపీటీసీ దొంతుల దేవదాస్, బాబు సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు ఎస్టీయూ ఆధ్వర్యంలో సన్మానం

ఉట్నూర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో నెలకొల్పిన బీఎడ్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా నియమితులైన రాథోడ్‌మాణిక్‌రావుని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్‌రవికుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతం అయిన ఉట్నూర్‌లోని బీఈడీ కళాశాలకు రాథోడ్ మాణిక్‌రావు లాంటి అంకిత భావం గల ప్రిన్సిపాల్‌ను నియమించడం శుభ పరిణామం అన్నారు. అంతేకాకుండా ఉపాధ్యాయ శిక్షణపొందే గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాదవ్ అశోక్‌కుమార్, రాష్ట్ర నాయకులు దిలేష్ చౌహాన్, శీతల్‌చౌహాన్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి బానోత్ ఆత్మారాం, దినేష్ కుమార్, ప్రేమ్‌సింగ్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ మాణిక్‌రావును సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

మాతశిశు మరణాలు జరగకుండా చూడాలి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాథోడ్ నరేందర్

ఉట్నూర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాత శిశు మరణాలు జరుగకుండా వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాథోడ్‌నరేందర్, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి (ఏజెన్సీ) డాక్టర్ కుడిమెత మనోహర్‌లు అన్నారు. శుక్రవారం ఐటీడీఏ ఆవరణలోని అదనపు జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో దంతనపల్లి, షాంపూర్, ఇంద్రవెల్లి, పిట్టబొంగరం, హస్నాపూర్, నార్నూర్, గాదిగూడ, ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మాతా శిశు సంరక్షన, గర్భవతుల రిజిస్ట్రేషన్‌తో పాటు రక్తహీనతతో ఉన్న గర్భవతులను గుర్తించి వారికి సరైన వైద్యం అందించాలన్నారు. హిమోగ్లోబిన్ పర్సంటేజ్ పెంచేటట్టు ఐరన్ ఇంజక్షన్ మరియు హైరిస్క్ గర్భవతులకు ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ ఉండాలని, ఎన్‌సీడీ కార్యక్రమం గురించి ప్రతి ఏఎన్ఎం ప్రతిరోజు ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా బీపీ,షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులు ఉన్న వారిని గుర్తించి ఎన్‌సీడీపోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అదే విధంగా క్షయ వ్యాధి నివారణలో భాగంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తేమడ పరీక్షల శాతం పెంచాలని, అనుమానితులకు పరీక్షలు చేయించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వెళ్లినప్పుడు ప్రజలకు పైన చూపబడిన వ్యాధుల గురించి అవగామన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ సాధన, డాక్టర్ సుమలత, డాక్టర్ శ్రీధర్‌లు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న జిల్లా వైద్య అధికారులు రాథోడ్‌నరేందర్, కుడుమెత మనోహర్, సుమలతలు

నెమలిని వేటాడిన ముగ్గురిపై కేసు.. రిమాండ్

బోథ్, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామంలో కూలిపని నిమిత్తం వచ్చిన ముగ్గురు గురువారం అర్ధరాత్రి పూట నెమలిని వేటాడి తీసుకొని వస్తుండగా బోథ్ అటవి శాఖ అధికాప ప్రణయ్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు అటవి శాఖ అధికారి తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి... గాదిగూడ మండలంలోని కాందురాంపూర్ గ్రామానికి చెందిన భరద్వాలు గంగాసింగ్ అదే మండలానికి చెందిన పిప్రేదత్తు ఇంద్రవెల్లి మండలంలోని గోపాల్పూర్ గ్రామానికి చెందిన తాల్‌పే బాలాజిలు ముగ్గురు కలిసి గ్రామం సమీపంలో ఉన్న పొలాలలో నెమలిని చంపి తీసుకు వస్తుండగా పట్టుబడ్డారన్నారు. అయితే మీరు పొలం పనుల నిమిత్తం వెళ్లిన సమయంలో నెమలి గుడ్లు పెట్టిన విషయాన్ని గమనించి రాత్రిపూట పథకం ప్రకారం నెమలిని చంపారన్నారు. అయితే జాతీయ పక్షి అయిన నెమలిని వేటాడం చట్టరీత్యా నేరం కావడంతో వారిని అదుపులోకి తీసుకుని శుక్రవారం కోర్టులో హాజరు పరిచామని, అలాగే, 14 రోజులు రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. కాగా అటవి జంతువుల పరిరక్షణ పై అటవి శాఖ అధికారులు గ్రామాలలో ప్రజలను చైతన్యం చేస్తున్న జంతువులు పక్షుల పై వేట కొనసాగుతునే ఉంది. ఇటువంటి చర్యలకు పాల్పడితే కేసులు తప్పవని అటవి శాఖ అధికారులు వివరించారు.





పట్టుబడిన నిందితులతో అటవీ శాఖ అధికారులు

బీసీ రిజర్వేషన్‌ల తర్వాతే ఎన్నికలు జరపాలి

(5వ పేజీ తరువాయి...)

ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బీసీ కుల నాయకులు కొండేరి రమేష్, రాథోడ్‌శేషరావు, సీపతి లింగాగౌడ్, కాల్వరవి, సల్లరే రవీందర్, సాడిగే రాజేశ్వర్, కందుకూరి రమేష్, బొద్దుకిరణ్, చింతల రమణ తదితరులు పాల్గొన్నారు.

● సుంకిడి అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో

తలమడుగు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు అయ్యాకే ఎన్నికలు నిర్వహించాలని, లేని పక్షంలో ఎన్నికలను బహిష్కరిస్తామని తలమడుగు మండల బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు మేకల రవికాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సుంకిడి అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు వెలువడడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని కట్టుబడి ఉండి 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్దంగా ఇచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ప్రక్రియను చేపట్టేదని, న్యాయపరమైన సమస్యలు వస్తాయని తెలిసి కూడా బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకునేందుకు నాటకం ఆడిందని సష్టంగా కనిపిస్తుందన్నారు. గ్రామ గ్రామన బీసీ ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 42 శాతం రిజర్వేషన్ అమలు అయ్యాకనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘము ప్రధాన కార్యదర్శి వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ మడూరి రమాకాంత్, బీసీ సంఘాల నాయకులు తోట వెంకటేష్, ఆశన్న యాదవ్, అసం రవి, మహేందర్ యాదవ్, శశికాంత్ యాదవ్, శ్రీనివాస్, వామన్, అజయ్, తోట ప్రమోద్, శశికాంత్ పాల్గొన్నారు.

డీసీసీ పీఠం.. ఎవరిది?

(5వ పేజీ తరువాయి...)

శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు పర్యటించి పార్టీ పరిస్థితులు, నేతల అభిప్రాయాలను సేకరించనున్నారు.

అధిష్ఠానం వద్దకు పరుగులు

డీసీసీ పదవిని ఆశిస్తున్న వారంతా అధిష్ఠానం వద్దకు పరుగులు తీస్తున్నారు. తరుచు హైదరాబాద్‌లోనే మకాం వేస్తూ పార్టీ పదవులను దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీలో తమకున్న పరిచయాలు, పలుకుబడితో చక్రం తిప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. 2017కు ముందు పార్టీలో కొనసాగిన వారికే పదవులు కేటాయిస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. దీనినే ప్రామాణికంగా తీసుకుంటే ఒకరిద్దరు నేతలు మాత్రమే పోటీలో ఉండే అవకాశం ఉంది. రెడ్డి సామాజిక వర్గం నుంచి ముగ్గురు, ఎస్టీ సామాజిక వర్గం నుంచి ఇద్దరునేతలు రేసులో ఉన్నట్లు తెలుస్తుంది. అయితే బీసీ సామాజిక వర్గం నుంచి ఒకరిద్దరి పేర్లను కూడా పరిశీలించే అవకాశం లేక పోలేదంటున్నారు. పార్టీలో సీనియార్టి, అనుభవానికి ప్రాధాన్యత ఇస్తారా లేదా ఆర్థికంగా, ప్రజల్లో మంచి పలుకుబడి ఉన్న నేతలకే అవకాశం కల్పిస్తారా? అనే దానిపై జోరుగా చర్చ సాగుతోంది.



మాంసాహార దుకాణం ముందర పడేసి చికెన్ ముక్కలు తింటున్న కుక్కలు (ఇన్‌సెట్‌లో వింత వ్యాధి సోకిన కుక్క)

నార్నూర్‌లో వీధి కుక్కలకు వింత రోగాలు!

ఆదిలాబాద్(నార్నూర్), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కుక్కల బెడద ఎక్కువవుతోంది. కుక్కలు గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయి. చాలా కుక్కలకు సోకుతున్న చర్మ వ్యాధులతో ప్రమాదం పొంచి ఉంది. గత కొన్నిరోజులుగా వీధి కుక్కలకు కొత్త రోగం అంటుకునట్లుగా కనబడుతున్నాయి. కుక్కల ఒంటిపై బొచ్చు ఊడి పోవడం, దద్దుర్‌లు రావడం, చిన్న చిన్న పుండ్లు ఏర్పడుతున్నాయి. రాలిపోయిన చోట పురుగులు ఉంటున్నాయి. వాటిని చూస్తే భయం వేస్తోందని జనాలు అంటున్నారు. అవి జనావాసాల్లోకి రావడంతో చిన్న పిల్లలు, వృద్ధులకు అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చికెన్, మటన్ షాపుల చుట్టుపక్కల వందలకు పైగా ఇలాంటి కుక్కలు సంచరిస్తున్నాయి. జనాలు సైతం అక్కడ మాంసాహారం కొంటున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడితే దీనికి ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ విషయమై ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొనసాగుతున్న బతుకమ్మల నిమజ్జనం

బోథ్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో బతుకమ్మల నిమజ్జన కార్యక్రమం కొనసాగుతున్నది. మండలంలోని పలు గ్రామాలలో బతుకమ్మల నిమజ్జన కార్యక్రమాలను ప్రతిరోజు కొనసాగిస్తున్నారు. అయితే మండల కేంద్రంలో గురువారం రాత్రి మైసమ్మ గల్లీ మహిళలు గంగపుత్ర సంఘం మహిళలు నిమజ్జనాన్ని నిర్వహించారు. గ్రామం సమీపంలోని వాగుల్లో అర్ధరాత్రి దటాక నిమజ్జనం గావించారు. కార్యక్రమంలో ఆయా కాలనీల మహిళలు పాల్గొన్నారు.




బోథ్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భార్య కాపురానికి రావడం లేదని

యువకుడి ఆత్మహత్య

నిర్మల్ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం చెంది మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అనంతపేట్ గ్రామానికి చెందిన బొబ్బిలి నరేందర్(27) అనే యువకుడు కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడని తెలిపారు. మద్యం తాగి భార్యను బాగా వేధించడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో గురువారం రాత్రి గ్రామ శివారులోని చెట్ల పొదల్లో క్రిమిసంహారక మందు తాగి పడిపోవడంతో అతని బంధువులు ఆసుపత్రికి తీసుకువచ్చి ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం చనిపోయాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాల పరిశీలన



సాద్గాం ప్రాథమిక పరిశీలను సందర్శించిన ఎంఈఓ

లోకేశ్వరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాద్గాం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో బి.చంద్రకాంత్ సందర్శించి విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి తెలుగు, ఆంగ్లంలో ధారాళంగా చదివిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేట్టు చూడాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనము అందించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

ఆకొండపేట్‌లో జనసురక్ష అవగాహన కార్యక్రమం

దస్తురాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆకొండపేట్ గ్రామంలో డిస్ట్రిక్ట్ లీడ్‌బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ ఆధ్వర్యంలో జనసురక్ష సాచురేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌గోపాల్ మాట్లాడుతూ... బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. బీమా పథకాలు, సైబర్ మోసాల గురించి గ్రామప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బ్యాంక్ వారు అందిస్తున్న బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యక్తిగత రుణాలు పొంది అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో సీఎఫ్ఎల్ ప్రశాంత్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్

కాంగ్రెస్ దొంగ హామీలపై పోరాటం చేస్తాం

● బీఆర్ఎస్ నేత కిరణ్ కొమ్రేవార్

బాసర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దె నెక్కిందని బీఆర్ఎస్ నేత కిరణ్‌కొమ్రేవార్ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ బాసర మండల అధ్యక్షుడు కోర్వశ్యామ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను, వాటి అమలు తీరును ప్రశ్నిస్తూ రూపొందించిన దొంగహామీల కార్డును విడుదల చేశారు. సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ కిరణ్‌కొమ్రేవార్, విలాస్ గాదేవార్, డాక్టర్ రమాదేవి, లోలం శ్యాంసుందర్ నేతృత్వంలో జరిగి సమావేశంలో నాయకులు మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ ఉన్న దొంగ హామీల కార్డును ప్రతి ఇంటికి తీసుకెళ్లి వారి మోసాలను బహిర్గతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ బాసర మండలంలో నష్టపోయిన ప్రతి రైతుకు తగిన నష్టపరిహారం సబ్సిడీ ధర వచ్చే వరకు పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. అదే విధంగా బాసర దేవాలయ అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో మంజూరయిన రూ. 42 కోట్ల రూపాయలను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిచిపోయాయని ఆరోపించారు. ఈ నిధులు తిరిగి వచ్చే వరకు తమ పోరాటం ఆగదని, దేవాలయ అభివృద్ధికి అండగా ఉంటామని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజ యం కోసం నాయకులందరికీ అండగా ఉంటామని, గెలుపు కోసం కృషి చేస్తామని కోర్వ శ్యామ్ తెలియజజేశారు. కార్యక్రమంలో బాసర మండల ముఖ్య నాయకులు గంగారావు, నర్సింగరావు, ధర్మారావు, సంజీవ్ రావు, మారుతి పటేల్, మాధవ్‌పటేల్, లక్ష్మారెడ్డి, పోశెట్టి, గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బాసరలో కార్డును విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గ్రూప్-1 అధికారికి సన్మానం

లోకేశ్వరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్ అధ్యాపకులుగా పని చేస్తున్న పంకజ్ పాల్‌కు ఇటీవల విడుదలైన గ్రూప్- 1 ఫలితాల్లో ఏటీవో (అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్)గా సెలక్ట్ అయిన సందర్భంగా జూనియర్ కాలేజీ అధ్యాపకులు పంకజ్ పాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సన్మానిస్తున్న దృశ్యం

బీసీ కోటా ఓ నాటకం.. తగిన బుద్ధి చెప్పాలి

ఖానాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెల్లని జీవో తెచ్చి కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందని ఖానాపూర్ నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ బీసీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ బీసీ విభాగం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సక్కారం శ్రీనివాస్, కడెం మండలం మాజీ ఎంపీపీ రాజేశ్వర్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు బీసీ రాజన్న, పుప్పాల గజేందర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శనిగారపు శ్రావణ్, డీఆర్‌బీఎస్ మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు తదితరులు మాట్లాడారు. బీసీ కోటపై ప్రభుత్వం తెచ్చిన చెల్లని జీవో 9పై రాష్ట్ర హైకోర్టు స్టే విధిస్తుందని చట్టం పట్ల కనీస అవగాహన ఉన్న ప్రతి సామాన్యుడికి ముందే తెలుసన్నారు. న్యాయ సమీక్షకు నిలబడదని తెలిసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంటూ కాంగ్రెస్ సర్కారు 22 నెలలుగా డ్రామా కొనసాగించిందన్నారు. బీహార్ ఎన్నికల్లో లబ్ది పొందేందుకే ఈ డ్రామాను తెరపైకి తెచ్చారని ఆరోపించారు. తెలంగాణ బీసీ బిడ్డలను రేవంత్ సర్కార్ మరోసారి మోసం చేసిందన్నారు. బడుగు రాజకీయ ఆవలతో రేవంత్ సర్కార్ చెలగాట మాడిందని మండిపడ్డారు. రాజ్యాంగ సవరణ లేకుండా కేవలం అసెంబ్లీ తీర్మానంతోనే బీసీ కోట రాదని విపక్షాలు, బీసీ విద్యావంతులు ఎంత చెప్పినా వినకుండా ఎన్నికల నోటిఫికెన్ దాకా తెచ్చి కోర్టు ముందు ఈ పాలకులు చేతులెత్తేస్తారన్నారు. కాంగ్రెస్ చేసిన ఈ మోసాన్ని తెలంగాణ బీసీ బిడ్డలు తప్పకుండా గుర్తుపెట్టుకుని రాబోయే ఎన్నికల్లో ఈ పార్టీకి బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో బాధనకుర్తి మాజీ సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, ఖానాపూర్ మాజీ ఉప సర్పంచ్ కారింగుల సుమన్, బీఆర్ఎస్ నాయకులు తోట సుమిత్, సంద రాకేష్, కొక్కుల శేఖర్, శ్రీధర్ గౌడ్ సహా ఆయా మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ బీసీ విభాగం నాయకులున్నారు.



ఖానాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ బీసీ విభాగం నాయకులు

జాతీయ అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం



జాతీయ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న మస్కాపూర్ గ్రామస్థులు

ఖానాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో 'గ్లోబల్ బెస్ట్ టీచర్ రోల్ మోడల్ అవార్డు 2025' అందుకున్న మస్కాపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్‌ను శుక్రవారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. శ్రీనివాస్ శిక్షణ ఇవ్వడంతో గతంలో 116 మంది పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో స్కాలర్‌షిప్ సాధించారన్నారు. ఆయన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడిదెల మహేందర్, గ్రామస్థులు డి.చిన్నయ్య, పుప్పాల గజేందర్, మహిపాల్, చిన్ను, మధు, వెంకట్రాములు, బాలాజీ, శివ, ఇమ్రాన్, గిరి ఉన్నారు.

సీజేఐపై దాడి సరికాదు



పట్టణ సీఐ గోపినాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రతినిధులు

భైంసా, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత సుప్రింకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై చోటు చేసుకున్న దాడి ఘటనను వ్యతిరేకిస్తు శుక్రవారం భైంసాలో బుద్ధ అంబేద్కర్ ఐడల్ ప్రోటక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. సొసైటీ అధ్యక్షుడు దేవిదాస్‌హాస్డే ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. దాడికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మతోన్మాదుల ఆగడాలు రోజురోజుకు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీజేఐపై జరిగిన దాడి భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. ఇటువంటి దాడులకు పాల్పడే మతోన్మాదులపై కఠినవైఖరిని ప్రదర్శించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీసభ్యులు సంబంధిత విషయంలో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిటీ అధ్యక్షులు దేవిదాస్ హాస్డే సంబంధిత విషయంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో టౌన్ సీఐ గోపినాథ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీఎమ్మెల్యే

తానూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెంబర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జాదవ్‌బాపురావు తండ్రి జాదవ్ రామచందర్ పాటిల్ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెం దాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈయన వెంట మాజీ జెడ్పీచైర్మన్ సాగరబాయిరాజన్న, మాజీ జెడ్పీటీసీ ఉత్తం భాలేరావు, మాజీ సర్పంచ్ సాయినాథ్, సాహెబ్‌రావు, గైక్వాడ్ సాయినాథ్ ఝరి న్నారు.



డబ్లింగ్ పనులు వద్ద మాట్లాడుతున్న రైతులు

డబ్లింగ్ పనులతో పొలాలకు దారి బంద్

» రహదారి తొలగింపుతో రైతుల ఇక్కట్లు

బాసర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే అధికారులు చేపట్టిన రైల్వే డబల్ లైనింగ్‌పనులు బాసర ప్రాంత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రైల్వేలైన్‌కు ఆనుకుని ఉన్న పొలాల వద్ద ఉన్న ఏకైక రహదారిని పూర్తిగా తొలగించడంతో రైతులు తమ పంట పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే డబ్లింగ్ పనులు వేగవంతం కావడంతో, రైల్వే అధికారులు రోడ్డును పూర్తిగా తొలగించారని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ఉన్న కొద్దిపాటి పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలో పొలాలకు వెళ్లేమార్గం మూసుకు పోవడం తమకు తీరని నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు వెళ్లడానికి ఇప్పుడు మాకు దారి లేకుండా పోయింది. ట్రాక్టర్లు, ఇతర సామాగ్రి తీసుకెళ్లడం పక్కన పెడితే, మేము కాలినడక కూడా పొలాలకు వెళ్లలేక పోతున్నాం. ఈ సమయంలో పంటలకు పురుగు, మందులు, ఎరువులు వేయక పోతే ఉన్న పంట కూడా చేజారి పోతుంది. అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే అధికారులు వెంటనే స్పందించి, తాత్కాలికంగానైనా తమ పంట పొలాలకు వెళ్లేందుకు వీలుగా ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేయాలని, లేదంటే రైల్వే పనులు పూర్తయ్యే వరకు తమ పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని బాసర రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బాలికల భద్రత.. ప్రతీ ఒక్కరి బాధ్యత

» బాలికలతో బలమైన సమాజం

» నేడు బాలికల అంతర్జాతీయ దినోత్సవం

ముథోల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలిక అనగానే ప్రేమ, మమకారం, ధైర్యం, స్ఫూర్తి గుర్తుకొస్తాయి. సమాజంలో సమాన అవకాశాలు కల్పించి, ప్రతీ బాలికకు తన కలలు సాకారం చేసుకునే వేదిక కల్పించడమే అంతర్జాతీయ బాలికల దినోత్సవం ప్రధాన ఉద్దేశం. 2012లో ఐక్యరాజ్య సమితి అక్టోబరు 11న ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం బాలికల హక్కులు, భద్రత, విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా చైతన్యం పెంచేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్య, ఆరోగ్యం, భద్రత రంగాల్లో వారిని ముందుకు తీసుకెళ్లడం ఐక్యరాజ్య సమితి ఈ దినాన్ని అధికారికంగా ప్రకటించింది. ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇప్పటికీ బాలికలపై వివక్ష, చిన్న వయస్సులో వివాహాలు, విద్యా లోపం, లింగ అసమానత వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితిని మార్చడానికి, ప్రతి బాలిక స్వేచ్ఛగా ఎదగగల సమాజం నిర్మాణం కోసం ఈ దినోత్సవం ప్రాధాన్యం వహిస్తుంది. భారత దేశంలో 'బేటీ బచావో - బేటీ పడావో సుకన్య సమృద్ధి యోజన', కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ వంటి పథకాల ద్వారా బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తును మెరుగుపర్చే ప్రయత్నాలు కొనసాగుతున్నా యి. గ్రామీణ ప్రాంతాల నుంచి సైన్స్, టెక్నాలజీ, క్రీడలు, పరిపాలన వంటి రంగాల్లో అగ్రస్థానాలు సాధిస్తున్న బాలికలు దేశానికి గర్వకారణం అవుతున్నారు. బాలిక ఒక కుటుంబానికి వెలుగు. ఆమెను చదివించడం అంటే కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని బలపరచడం. బాలికలపై వివక్షను నిర్మూలించడం ప్రతీఒక్కరి బాధ్యత. ఆమెకు అవకాశం



ఇవ్వండి - అద్భుతం చూపుతుంది అని ఈ దినోత్సవం మనకు గుర్తు చేస్తుంది. అక్టోబరు 11ను పండుగగా కాదు. ఒక ప్రేరణ దినంగా జరుపుకోవాలి. ప్రతి బాలిక చిరునవ్వుతో, భయం లేకుండా, గర్వంగా జీవించగల సమాజం కోసం మనందరం చేతులు కలపాలి.

నిర్మల్ జిల్లాలో 78,999 మంది

నిర్మల్ జిల్లాలో సుమారు 78,999 మంది బాలికలున్నారు. 0-6 సంవత్సరాలలోపు ఆడ పిల్లలు 19,000, ఒకటో తరగతి నుంచి 10వ తరగతి చదు వుతున్న బాలికలు 55,199, ఇంటర్మీడి యట్ చదువుతున్న బాలికలు 4,800, డిగ్రీ చదువుతున్న బాలికలు సుమారు 1500లు ఉన్నారు.

విద్యలో ముందంజలో నిర్మల్ బాలికలు..

జిల్లా స్థాయి విద్యాసంస్థల్లో బాలికలు విద్యలో అద్భుత ప్రతిభ చూపుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న 'కళ్యాణ లక్ష్మి, సుకన్య సమృద్ధి', బేటీ బచావో - బేటీ పడావో' వంటి పథకాలు బాలికల చదువుకు పెద్ద ఊతమిస్తున్నాయి. విద్యే మార్పుకు సాధనం అని చెప్పుకోవచ్చు. విద్యతో అన్ని సాధ్యం అవుతాయి. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉన్నప్పటికీ, కష్టపడి విద్యలో అగ్రగాములవుతున్న బాలికలు నిర్మల్‌లో చాలా మంది ఉన్నారు. చదువుతో పా టు విద్యార్థినులు క్రీడలలో కూడా రాణిస్తున్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించారు. వీరి విజయాలు గ్రామీణ బాలికలకు స్ఫూర్తిదాయకంగా మారాయి. 'బాలికా రక్షణ - మన సమాజపు ధ్యేయం' అనే నినాదంతో ప్రతీ సంవత్సరం ఆయా ప్రాంతంలో ర్యాలీలు నిర్వహి స్తారు. స్థానిక కళాశాల, పాఠశాలల్లో విద్యార్థి నులు వీధి నాటికల ద్వారా బాలికలపై వేధింపులు, శిశు వివాహాల దుష్పరిణామాలపై సందేశాలు అందించను న్నారు. ప్రతీ బాలికకు సమాన అవ కాశాలు కల్పించడం, విద్య, ఆరోగ్య రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పె ట్టుకుంది. ఇందులో భాగంగా బాలికలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయి. తల్లిదండ్రులు బాలికలను బలహీనంగా కాకుండా బలంగా చూడాలి.

భద్రత - ప్రతీ ఒక్కరి బాధ్యత..

బాలికల రక్షణ కుటుంబం, పాఠశాల, సమాజం సమానంగా పాత్ర వహించాలి. 'చైల్డ్ హెల్ప్ లైన్ - 1098' ద్వారా ఎప్పుడైనా సహాయం పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. జిల్లా మహిళా సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ బాలికలపై వేధింపులు, శిశు వివాహాలు, దుర్వినియోగం వంటి సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వ హిస్తున్నాయి.



అంబులెన్స్‌లో ప్రసవం చేసిన ఈఎంటీ

అత్యవసర పరిస్థితుల్లో ఆదుకుంటున్న అంబులెన్స్‌లు

» అంబులెన్స్‌లో శిశువు జననం

ఉట్నూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ గిరిజన ప్రాంతాల ప్రజలను అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ ఆదుకుంటున్నాయి. గ్రా మీణ గిరిజన ప్రాంతాల ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందిస్తున్న 108 అంబులెన్స్‌ల సిబ్బంది ఇటీవల అంబులెన్స్‌లలో ప్రసవాలు కూడా నిర్వహిస్తూ అమాయక గ్రామీణ ప్రజలను ఆదుకుంటున్నారు. గత మూడు రోజుల క్రితం ఇంద్రవెల్లి మండలంలోని కన్నాపూర్‌కు చెందిన గర్భవతిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పాటకూడా వద్ద పురిటి నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ శేఖర్ అంబులెన్స్‌ను రోడ్డు పక్కన నిలబెట్టి అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన బాలాజి సతీమణి ముక్తాబాయికి పురిటి నొప్పులు రావడంతో సమాచారం అందుకున్న షాంపూర్ 108 ఈఎంటీ ప్రవీణ్ పైలెట్ రాజేందర్‌తో కలిసి తాండ్రకుచేరుకున్నారు. తీవ్ర ప్రసవ వేదన పడుతున్న ముక్తాబాయిని 108 అంబులెన్స్‌లో ఎక్కించుకొని ఉట్నూర్ సివిల్ ఆసుపత్రికి తరలించడానికి తెస్తుండగా మార్గమధ్యంలో కుమ్మరితాండ సమీపంలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కన నిలబెట్టి అంబులెన్స్ లోనే సుఖ ప్రసవం నిర్వహించారు. మగ శిశువుకు జన్మనివ్వడంతో తల్లిని, బాబును ఉట్నూర్ మండల కేంద్రంలోని సివిల్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించేలా 108 సిబ్బంది కృషి చేశారు. గత కొన్ని నెలలుగా 108 అంబులెన్స్‌ల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి సేవలు అందిస్తున్నారని ఏజెన్సీ ప్రజలు పేర్కొంటున్నారు.

ప్రారంభమైన సోయాబీన్ పంట కోతలు

బోథ్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్షం తగ్గిపోయి ఎండలు కాస్తుండడంతో రైతులు సో యాబీన్ పంట కోతలు ప్రారంభించారు. ప్రతి సంవత్సరం సోయాబీన్ పంట దసరా పండుగ సమయంలో కోతకు వస్తుంది. అయితే ఏడాది వర్షాల వల్ల సోయా పంట కోత ఆలస్యమైంది. మూడు రోజుల క్రితం వరకు వర్షాలు కురవడంతో రైతులు సోయా పంట ఇంటికి చేరుతుందో లేదో అని ఆందోళన గురయ్యారు. వర్షం తగ్గడంతో సోయా పంట కోతలు ప్రారంభమయ్యాయి.

కూలీల కొరత

సోయా పంట కోత పనులు రైతులు ప్రారంభించారు. దీంతో కూలీల కొరత ఏర్పడింది. ఫలితంగా కూలీల డిమాండ్ పెరిగిందని రైతులు వాపోతున్నారు. మరోవైపు స్థానికంగా కూలీలు దొరకక పోవడంతో మహారాష్ట్ర నుంచి కూలీలను రప్పిస్తున్నారు. అంతేకాక కూలీ రేట్లు ఎంత సైతం పెంచడంతో రైతుల పైన ఆర్థిక భారం పడే అస్కారం ఉంది. అధిక వర్షాల వల్ల పంటలు దిగుబడి నిరాశజనకంగా ఉండడంతో కూలీ రేట్లు పెరుగుదలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ కొనుగోలు ప్రారంభించాలి..

సోయా పంట చేతికి వస్తుండడంతో పంటను విక్రయించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మరోవైపు పంట కొనుగోలుకు ప్రైవేట్ వ్యాపారులు సైతం రంగంలోకి దిగే అస్కారం ఉంది. ప్రైవేట్ మార్కెట్లో ధర లేక పోవడంతో రైతులు ప్రభుత్వ రంగ సంస్థలకు విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సాధ్యమైనంత త్వరలో పంట కొనుగోలు చేపట్టాలని కోరుతున్నారు.



కుప్పలుగా వేస్తున్న సోయాబీన్ పంట

రైతులకు దిక్కెవ్వరు?

● సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తహసీల్దార్‌కు వేడుకోలు



తహసీల్దార్‌కు సమస్యలనువిన్నవిస్తున్న రైతులు

ముథోల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీలతకు రైతులు వేడుకున్నారు. అధిక వర్షాలు కురవడం వలన సోయా రైతులు నష్టపోవడమే కాకుండా ఉన్న కొద్ది దిగుబడులు సైతం కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో వాటిని భద్రపరి చేందుకు సైతం స్థలాలు లేవని, ఒకవేళ వర్షం పడితే నష్టం జరుగుతుం దన్నారు. గతంలో కూడా కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పా టు చేయాలని వినతి పత్రం అందించామని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే ఏర్పాటు చేయాలని వేడుకున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తే వాళ్ల తక్కువ ధరలకే కొనుగోలు చేస్తున్నారని ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. అయితే ఇంతకుముందు మీ వినతి పత్రం అందజేసిన అంద జేసిన విషయం వెంటనే ఉన్నతాధికారులకు గతంలో కూడా తెలియజేశా నని ఇప్పుడు కూడా తెలియజేస్తానని తహసీల్దార్ తెలిపారు. సోయా కొనుగోలు కేంద్రాలు అక్టోబరు మొదటి వారంలోనే ఏర్పాటు చేయించాల ని అన్ని వ్యవస్థల అధికారులకు, గ్రామ గ్రామాన ఉన్న స్థానిక నాయ కులకు మాటల రూపంలో, రాతల రూపంలో వినతి పత్రాల రూపంలో, గ్రామ కమిటీల సమావేశం రూపంలో తెలియజేయడం జరిగిందని రైతులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో ముథోల్, కారేగాం, బ్రహ్మణ్‌గావ్, ఆష్టా గ్రామాలకు చెందిన రైతులు, రైతు నాయకులు సాయిప్రసాద్, పి.గంగారెడ్డి, శ్రీధర్ రెడ్డి, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లపై కొరవడిన పర్యవేక్షణ

» జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి

బోథ్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హాస్టల్లో నిర్వహణపైన పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో జిల్లా కలెక్టర్ అధికారుల తీరుపై పరిశీలిస్తున్నట్లు అవగతమగుతున్నది. ఇటీవల కొన్ని హాస్టల్లో నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో విద్యార్థుల ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించారు. అయితే తనిఖీల సందర్భంగా వచ్చిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఫిర్యాదులు వెళ్లాయి. మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాలలో వెలుగు చూసిన పలు అంశాల పైన మహిళ సమాఖ్య అధ్యక్షుల ఫిర్యాదు మేరకు వచ్చిన అధికారి తనిఖీ విషయంలో అలసత్వం వహించిందని మహిళా సమాఖ్య అధ్యక్షులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో తనిఖీకి వచ్చిన అధికారి ఇచ్చిన రిపోర్టును పరిశీలించినట్లు సమాచారం. అంతేకాక గతంలో సైతం కొన్ని హాస్టల్లో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదులు వెళ్లిన తనిఖీ కోసం వచ్చిన అధికారి మాములుగా తీసుకోవడం జరిగిందని పలువురు పేర్కొంటున్నారు.

సెక్టోరియల్ అధికారిపై వేటుకు కారణం ఫిర్యాదులేనా..

బోథ్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్లో జరిగిన సంఘటనపై విచారణకు వ చ్చిన సెక్టోరియల్ అధికారి పూర్తి స్థాయిలో వి చారణ చేపట్టకుండా వెళ్లిందని మహిళా సం ఘాల వారు ఆరోపించారు. అయితే పిల్లలకు న్యాయం జరగదు అంటూ కొంత మంది మహి ళా నాయకులు జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ అధికారిపై వేటు వేసినట్లు సమాచారం. అధికారుల తీరు పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనుమతులుండవు.. లోపలికి రావద్దు

బాలికల హాస్టల్‌లో ఏం జరుగుతుందో బయ ట ప్రపంచానికి తెలవనీయడం లేదు ఏ విధమైన భోజనం పెడుతున్నారు. విద్యార్థులకు ఇ బ్బందులు ఏమున్నాయో బయట వ్యక్తులకు తె లపకుండా హాస్టల్‌లోని నిర్వాహకులు జాగ్రత్త పడుతున్నారు. కొన్ని హాస్టల్లలో విద్యార్థులకు స్పందించి భోజనం ఇష్టానుసారంగా కొనసాగుతుందన్న విమర్శలు వస్తున్నాయి. అయితే వా స్తవాలు తెలుసుకునేందుకు లోపలికి వెళ్లాలంటే హాస్టల్ వార్డెన్‌లు అనుమతులు ఇవ్వడం లేదు. ఆడ పిల్లలు ఉన్న హాస్టళ్లకు వెళ్లేందుకు ఎవరికి అనుమతులు ఇవ్వద్దని జిల్లా అధికారులు పే ర్కొంటున్నారని అందువల్లే మేము ఎవరిని లో నికి రానివ్వం అంటూ ఒకరిద్దరు బాలికల హాస్ట ల్ వార్డెన్లు పేర్కొంటున్నారు. దీంతో లోపల జ రుగుతున్న తతంగం ఏమిటనేది బయట వ్యక్తులకు సమాచారం రావడం లేదు. హాస్టళ్లో ఉపాధ్యాయుల మధ్య సమన్వయం లోపం ఏర్పడితే తప్ప సమాచారం రావడం లేదు. తనిఖీ అధికారులు సహితం కొంత మంది హాస్టల్ వార్డెన్‌లతో మిలాకత్ అవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● బాసర తహసీల్దార్‌కు భారతీయ కిసాన్ సంఘం వినతి



బాసర తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బాసర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సోయా పంటను కొనుగోలు చేసేందుకు తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ రోజు భారతీయ కిషాన్ సంఘం ఆధ్వర్యంలో రైతులు బాసర తహసీల్దార్ పవనచంద్రను కలిశారు. మండలంలోని రైతులందరు కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. మండలంలో సోయా పంట విస్తారంగా సాగైందని, ప్రస్తుతం పంట చేతికి వచ్చే సమయం ఆసన్నమవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయక పోతే ప్రైవేటు, వ్యాపారులుదోపిడికి గురికావాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మద్ధతు ధర దక్కాలంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని వారు నొక్కి చెప్పారు. భారతీయ కిషాన్ సంఘం నాయకులు మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి, రైతుల సౌకర్యార్థం బాసర మండల కేంద్రంలోని సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులు వినతి పత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్, ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానని హామి ఇచ్చారు.


ఇంద్రవెల్లి ప్రధానోపాధ్యాయుడు సరెండర్

ఇంద్రవెల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక జడ్పీఎస్ఎస్ పాఠశాల హెచ్‌ఎం. రామ్మోహన్ రావ్‌కు సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇతని పై స్కూల్ గ్రాంట్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పీఎం శ్రీ పథకంలో భారీగా అవకతవకలకు పాల్పడినట్లు ఉపాధ్యాయ సంఘాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఉట్నూర్ సబ్ కలెక్టర్‌కు దర్యాప్తు చేసి నివేదికను అందించినట్లు సమాచారం. దీంతో పూర్తి నివేదికల ఆధారంగా పాఠశాల లక్షల నిధులను దుర్వినియోగంతో పాటు పాఠశాల వాతావరణాన్ని చెదగొట్టడంతో అయనకు సరెండర్ చేసినట్లు సమాచారం. ఇంద్రవెల్లి ఎంఈవో రాథోడ్ మానుకుమార్‌ను వివరణ కోరగా నాకు ఏం తెలియదని సమాధానం ఇచ్చారు.

రౌడీషీటర్ల ప్రవర్తనను పరిశీలించాలి

» శాంతి భద్రతలకు ఇబ్బందులు కలిగించే వారిని బైండోవర్ చేయాలి

» గంజాయి రహితసమాజం కోసం కృషి చేయాలి



ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉట్నూర్ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో సమావేశమైన ఎస్పీ అఖిల్ మహాజన్

ఇంద్రవెల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అమాయక ప్రజలను వేధించే, హింసించే వారి వద్ద దౌర్జన్యంతో డబ్బులు వసూలు చేసే రౌడీ సీటర్లు, సస్పెక్ట్ షీటర్లను, కేడీలను ఉక్కుపాదంతో అణిచివేసే చర్యలను జిల్లా పోలీసు యంత్రం గా చేపట్టిందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం రాత్రిమండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఉట్నూర్ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. పలు అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో రౌడీలు, సస్పెక్ట్ రౌడలపై ప్రతివారం తనిఖీలు చేస్తూ వారి కదలికలను పరిశీలించాలన్నారు. ప్రజలను హింసించిన, మోసం చేసిన దౌర్జన్యం చేసిన వారిపై తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో నమోదైన రౌడీ షీటర్లు ఎలాంటి నేరాలలో పాల్గొనకుండా సత్ప్రవర్తనతో ఉన్న వారిపై రౌడీ షీట్లు ఎత్తివేసే చర్యలు చేపడతామని తెలిపారు. ప్రతి గ్రామంలో విలేజ్ పోలీస్ అధికారి కీలకంగా వ్యవహరించి, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న గన్ లైసెన్స్‌ల వివరాలు, ప్రస్తుత పరిస్థితిపై క్షుణ్ణంగా చర్చించారు. నేరం చేసిన ప్రతీఒక్క నిందితుని వేలి ముద్రలను ఆన్‌లైన్‌లో న మోదు చేయాలన్నారు. గతంతో తరచూ నేరాలకు పాల్పడే వారిని బైండోవర్లు చేస్తూకట్టడి చేయాలన్నారు. అదేవిధంగా గంజాయి రహిత జిల్లాగా పేరు తీసుకోరావడానికి పోలీసు జిల్లా యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శీనివాస్, సీఐలు మడా వి ప్రసాద్, ఎస్సై సాయన్న ఉన్నారు.

చల్లారిన రాజకీయ వేడి

నేరడిగొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో ఎగిసిపడిన రాజకీయ ఉత్సాహం ఇప్పుడు చల్లారిపోయింది. మండలాల్లో రాజకీయ నాయకులు ఒక్కసారిగా శాంతించినట్లుగా కనిపిస్తున్నారు. అప్పటి వరకు పొత్తులు, ఎత్తులు, అభ్యర్థుల ఎంపికలపై మల్లగుల్లాలు పడిన రాజకీ య నేతల హడావిడి, వర్షం వచ్చి ఆగినట్టుగా తక్షణమే క్షీణించింది. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ఉత్సాహంగా సాగిన ఎన్నికల చర్చలు, వ్యూహ రచనలు, సభా చక్రాలు ఒక్కసారిగా ఆగిపోవడంతో రాజకీయ వాతావరణం మూగబోయింది. హమ్మయ్య, భలే పని అయింది అంటూ కొందరు ఊపిరి పీ లుస్తుండగా, మరికొందరు మాత్రం ఇంతలోనే ఉత్సాహం ఆగిపోవడం బాధకరం అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

● కోర్టు స్టే ప్రభావం

ఎన్నికల ప్రక్రియపై కోర్టు విధించిన స్టే కారణంగా రాజకీయ వేడి తాత్కాలికంగా చల్లారిపోయింది. కనీసం నెలరోజుల పాటు ఈ హడావిడికి బ్రేక్ పడినట్లే అయింది. పక్షానికీ, ప్రతిపక్షానికీ ఇది అనూహ్య విరామం లాగా మారింది.


నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు

● తాంసి ఎస్సై జీవన్‌రెడ్డి



తాంసిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

తాంసి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని తాంసి ఎస్సై జీవన్‌రెడ్డి అన్నారు. బతుకమ్మల నిమజ్జనం సందర్భంగా ఆయా గ్రామాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. మద్యం విక్రయాలు కానీ పేకాట, గంజాయి లాంటివి రవాణా చేస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు బానిసలు కావద్దని అన్నారు. పోలీసులు వారి వారి విధులను బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. వాహనదారులు తప్పనిసరిగా పూర్తిస్థాయి పత్రాలు కలిగి ఉండాలని ఒకవేళ లేనట్లు అయితే వెంటనే పత్రాలు పొందాలని అన్నారు. పెండింగ్ చలానాలను వెంటనే కట్టాలని లేని పక్షంలో ఆ ఫైన్‌లు రెట్టింపు అయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా బందోబస్తును పర్యవేక్షించారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. 33/11 కేవీ ఆదర్శనగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. సోఫీనగర్, కేజీబీవీ గురుకుల హాస్టల్, ఇందిరమ్మ కాలనీ, డీమార్ట్, సాగర్ కన్వెన్షన్, సిద్దాపూర్ వాటర్‌వర్క్స్, విద్యానగర్ కాలనీ, మంచిర్యాల ఎక్స్‌రోడ్, ఆదర్శనగర్, రామ్‌నగర్, గాయత్రిపురం, ఆస్రాకాలనీ, ఈద్‌గాం, భాగ్యనగర్, ఫిష్ మార్కెట్, సిద్ధాపూర్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అభివృద్ధి అంతంతే!

- ఒక్క పరిశ్రమ రాలేదు
- మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఊరట
- వెంటాడుతున్న సమస్యలు
- కొత్త జిల్లాగా ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తి
- బాసర ట్రిపుల్ ఐటీలో తీరని బాధలు





బాసరలోని ట్రిపుల్ ఐటీ

నిర్మల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ కొత్త జిల్లా గా ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇక్కడి ప్రజలు ఊహించినంతగా అభివృద్ధి శరవేగంగా జరగకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు తప్పా ఆశించిన రీతిలో అభివృద్ధి జరగలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తజిల్లాగా తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ ఇంకా తీపి చేదు అనుభవాలు నెలకొంటున్నాయి. జిల్లాలో మెడికల్ కళాశాలతో పాటు నర్సింగ్ కళాశాల కూడా మంజూరైంది. అయితే స్థానికులకు ఉపాధి కల్పించడం, దీంతో పాటు స్థానిక వనరులను ఉపయోగించుకునేందుకు ఏర్పా టు కావాల్సిన రెండు పరిశ్రమలు జిల్లా నుంచి తరలిపోయాయి. ఖానాపూర్ పట్టణం మాత్రం మేజర్ గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపల్ స్థాయికి చేరుకుంది. అదే విధంగా భైంసా పట్టణం రెవెన్యూ డివిజన్‌గా మారింది. అలాగే బాసర సరస్వతీ దేవి పుణ్యక్షేత్రం అభివృద్ధి కోసం మాస్టర్‌ప్లాన్ అమలు ఇప్పటికీ నోచుకోలేదు. దీంతో పాటు ఇక్కడి ట్రిపుల్ ఐటీలో కూడా సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అలాగే పీజీ సెంటర్ కూడా తిరిగి ఏర్పాటు కాలేదు. చాలా గ్రామాలకు ఇంకా రోడ్ల సౌకర్యం కూడా ఏర్పడలేదు. అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన కాళేశ్వరం హై లేవల్ పనులు కొత్త జిల్లాగా ఏర్పడిన తరువాత కూడా పూర్తికాలేదు. ఇలా ఒకటి రెండు విజయాలు తప్పా జిల్లా లో పెద్దగా అభివృద్ధి జగరకపోవడం సామన్య జనాన్ని అసంతృప్తికి గురిచేస్తోంది. పరిపాలన యంత్రాంగమంతా జిల్లా కేంద్రంలోనే కొనసాగుతున్నప్పటికీ సామాన్య జనానికి మాత్రం ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు.

బాసరకు నిరాశే...

జిల్లా ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడిచినా బాసర సరస్వతీ పుణ్యక్షేత్రం అలాగే ట్రిపుల్ ఐటీలు ఆశించిన మేర కు అభివృద్ధి సా ధించకపోవడం స్థానికుల ను నిరాశకు గురిచేస్తోంది. బాసర పుణ్యక్షేత్రంలో మాస్టర్‌ప్లాన్‌ను అమలుచేస్తామని హామీలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఆ మాస్టర్ ప్లాన్ అమలు కాలేదు. మొదట్లో కొంత మేరకు పనులు చేసినప్పటికీ తిరిగి ఇక్కడి అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. దీంతో పాటు ట్రిపుల్ ఐటీ అభివృద్ధి విషయంలో కూడా ఇక్కడి పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. ట్రిపుల్ ఐటీలో ఆశించిన మేరకు సౌకర్యాలు లేకపోవడంతో పాటు మెస్‌ల టెండర్‌ల ప్రక్రియ కూడా ఇప్పటికీ పూర్తికాలేదు. ఇలా జిల్లాలోనే ప్రతిష్టాత్మకంగా నిలిచే బాసర సరస్వతీ దేవి ఆలయంతో పాటు ట్రిపుల్ ఐటీ పట్ల ప్రభుత్వాలు ఇంకా నిర్లక్ష్య దోరణి ప్రదర్శించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తరలిన పరిశ్రమలు

కొత్త జిల్లా ఏర్పాటైతే ఇక్కడ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పడతాయని అందరు ఆశించారు. దీనికి అనుగుణంగానే దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లి వద్ద ఇథనాల్ పరిశ్రమ సోన్ మండలంలోని పాక్‌పట్ల వద్ద ఆయిల్ ఫాం ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇథనాల్ పరిశ్రమకు స్థానిక ప్రజలు వ్యతిరేకించడం, ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ నిర్మాణానికి నిబంధనలు అడ్డుతగలడంతో ఆ రెండు పరిశ్రమల ఏర్పాటు ఇక సాధ్యమయ్యే పరిస్థితులు లేవంటున్నారు. గతంలో కూడా బాసర వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పలు సాంకేతిక కారణాల వల్ల ఆ పరిశ్రమ బెల్లంపెల్లికి తరలిన సంగతి తెలిసిందే.

తీరని రవాణా సౌకర్యం...

జిల్లాలో సాధారణ అభివృద్ధి అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. భైంసా మండలంలోని గుండెగావ్ సమస్య ఇప్పటికీ తీరడం లేదు. అలాగే కాళేశ్వరం ప్యాకేజీ పనులు దాదాపు ఇరవై సంవత్సరాల నుంచి పూర్తికాకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్యాకేజీ 27,28వ నంబర్ కాలువల పనులు దశాబ్దాల నుంచి కొనసాగుతుండడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అలాగే జిల్లాలోని అనేక మారుమూల గ్రామాలకు ఇప్పటికీ రోడ్డుసౌకర్యం అందుబాటులో లేదు. వర్షాలకు కొట్టుకుపోయిన పస్పుల్లా వాగు పునర్‌నిర్మాణం పనులు ఇప్పటికీ మొదలుకాలేదు. పెంబి మండలంలోని 20 గ్రామాలకు రోడ్డు, కరెంటు సౌకర్యాలను పూర్తిస్థాయిలో కల్పించలేకపోతున్నారు.

పకడ్బందీగా పత్తి కొనుగోలు చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పత్తి పంట కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పత్తిపంట కొనుగోలు ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... పత్తి పంట కొనుగోలు ప్రక్రియ నిర్ణీత సమయానికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తిచేయాలన్నారు. కొనుగోళ్లకు సంబంధించి ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ కోసం కపాస్ కిసాన్‌యాప్‌ను వినియోగించాలని తెలిపారు. ఈ యాప్ గురించి అధికారులకు అవగాహన కల్పించారు. రైతులకు కపాస్ కిసాన్ అప్లికేషన్ వినియోగం గురించి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రైతులు పత్తికొనుగోలు సంబంధిత సేవలకు 1800 599 5779 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని చెప్పారు. 8897281111 వాట్సాప్ నంబర్‌ను సంప్రదించడం ద్వారా రైతులు పత్తి అమ్మకాలపై వివరాలను తెలుసుకోవచ్చని వివరించారు. రైతులు వారి పంటకు ఖచ్చితంగా మద్దతు ధర అందించాలని తెలిపారు. తేమ శాతం విషయంలో రైతులు నష్టపోకుండా వారికి అన్ని విషయాలు తెలపాలని పేర్కొన్నారు. జిన్నింగ్ మిల్లులలో అన్ని వసతులు ఉండాలని వివరించారు. అగ్నిమాపక పరికరాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. వే బ్రిడ్జిలకు నిర్ణీత గడువులతో స్టాంపింగ్ వేయించుకోవాలని చెప్పారు. పంటలు అమ్మగానే రైతులకు నిర్ణీత గడువు లోపల డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి కృషి : డీఆర్డీఏ పీడీ

మామడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి అన్నారు. జిల్లా పర్యాటక ప్రాంతాల డాక్యుమెంటరీ కోసం లింగాపూర్‌లోని పొనికి వనాన్ని సందర్శించారు. సీసీ గంగాప్రసాద్, హెచ్‌ఆర్ సుధాకర్, ఏపీవో శివాజీ, టీఏ చరణ్, సురేష్, రవి, కార్యదర్శి కళ్యాణి, ఎఫ్ఏ నవీన్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.


వనాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి

బీసీ రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాలని వినతి

భైంసా, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు పరిచాకే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని భైంసా డివిజన్ బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం మున్నూరుకాపు ముథోల్ నియోజక వర్గ అడ్‌హక్ కమిటీ, బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంబంధిత విషయంలో భైంసాలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి సుంకెట పోశెట్టి, మున్నూరు కాపు సంఘం అడ్‌హక్ కమిటీ ప్రతినిధులు ఎనుపోతుల మల్లేశ్వర్, చాదర్ లక్ష్మీనారాయణ, తుమోల్లదత్తు, రేవాజీ నర్సయ్య, పబ్బు ధర్మపురి తదితరులు మాట్లాడుతూ బీసీ వర్గాల 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. ఎన్నికల మెనిఫెస్టో, కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లను అమలుపరచి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ప్రభుత్వం సంబంధిత విషయంలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్ష పార్టీలను దోషిగా నిలబెట్టుకునే విధానాలను విడనాడలని హితవు పలికారు. లేని పక్షం లో బీసీ సంఘాలన్నింటిని ఐక్యత రిజర్వేషన్లు సాధించేంత వరకు ఆందోళన బాట కొనసాగిస్తామి వెల్లడించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక బస్టాండ్ మార్గంలో బీసీ సంఘాల ఐక్యవేదిక, మున్నూరుకాపు ముథోల్ నియోజక వర్గ అడ్‌హక్ కమిటీ ప్రతినిధులు ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు.


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

బీసీలకు అన్యాయం చేయవద్దు

- బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రాంనాథ్

నిర్మల్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ విషయంలో బీజేపీ పూర్తి సహకారం అందిస్తుందని, వారికి అన్యాయం చేయవద్దని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. నిర్మల్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ పూర్తి సహకారం అందిస్తుంది. కానీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తే చూస్తూ ఊరుకోదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల మీద ప్రేమ ఉంటే బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా చట్టం తీసుకొస్తే బీజేపీ మద్దతు ఇస్తుంది, కానీ 10 శాతం మైనారిటీలకు బీసీ కోటాలో అవకాశం కల్పించి బీసీలకు మోసం చేస్తే బీజేపీ ఉరుకోదన్నారు. అందుకే కేంద్రం ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు మోసం చేయడానికి జీవో నెంబర్ 9 ద్వారా ఆర్డినెన్స్ తీసుకువచ్చి అడ్డదారిన బీసీలను మోసం చేయాలని చూసిందన్నారు. ఆర్డినెన్స్ గవర్నర్ దగ్గరికి పంపిన తర్వాత మూడు నెలల్లో అవకాశం గవర్నర్ ఉంటుంది. కానీ అవకాశం ఇవ్వకుండానే హడావిడిగా స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీసీలకు 42 శాతం అని మోసం చేస్తూ ఎన్నికల ప్రకటనను వెలువరించిందన్నారు. ఈ బిల్లులను కోర్టు కొట్టేస్తే బీజేపీని వేలెత్తి చూపిస్తారా అన్నారు. బీసీల పట్ల బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదన్నారు. సమావేశంలో బీజేపీ కార్యాలయ కార్యదర్శి రాచకొండ సాగర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, సీనియర్ నాయకులు మేడిసెమ్మె రాజు, అలివేలు మంగ, కొండాజి శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

జోర్డాన్‌లో కుంటాల వాసికి ఇబ్బందులు

కుంటాల, అక్టోబర్, 10 (ఆంధ్రజ్యోతి) : మండలానికి చెందిన ముఖీమ్ ఇటీవల జోర్డాన్ వెళ్లేందుకు అందకూర్ గ్రామానికి చెందిన ఏజెంట్‌కు రూ.15 వేలు చెల్లించి వెళ్లాడు. అక్కడ ఆహారం సరిగా లేకపోవడం, డబ్బులు సరిపోకపోవడంతో స్వదేశానికి వెళతానని యజమాని అనుమతి కోరాడు. 6 నెలలు అయ్యాక చూద్దాం అనడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయాడు. కాని ఏడాది గడిచినా ఇంటికి పంపకపోవడంతో తాజాగా సామాజిక మాధ్యమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇంటికి చేర్చాలని వేడుకున్నాడు. ఎన్ఆర్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కుటుంబాల వివరాల సేకరించి జేఏడీ డిపార్టుమెంట్‌కు సమాచారం అందించగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

చింతల్‌చందాలో

రోడ్లపై రాళ్లు తొలగింపు


బండరాళ్లను తొలగిస్తున్న చింతల్‌చందా గ్రామస్థులు

లక్ష్మణచాంద, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు, ఇతర వాహనాలు, ప్రయాణికుల రాకపోకలకు సహకరించాలని చింతల్‌చందా గ్రామస్థులు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. చింతల్‌చందా గ్రామం నుంచి పొట్టపెల్లి గ్రామం వరకు గల తారురోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. మొక్కజొన్న ఆరబోసిన రాశులకు పక్కనే ఉన్న బండరాళ్లను తీసి ట్రాక్టర్‌లో వేసి తొలగించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లతో కొందరు రైతులు వాగ్వాదం పెట్టుకోవటం, దాడులకు పాల్పడటం వంటి సంఘటనల కారణంగా ఆర్టీసీ సర్వీసులను నిలిపి వేస్తున్నారని, తద్వారా మహిళలతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అందుకే వాహనాలు, ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న బండరాళ్లను తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలిగించకూడదని కోరారు. వీరితో పాటు పోలీసులు కూడా పాల్గొని రాకపోకలకు అంతరాయం కలిగించే వారు ఎవరైనా సరే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు పోలీసులు పాల్గొన్నారు.


మొక్కజొన్న ఆరబోసి బండరాళ్లు పెట్టడంతో నిలిచిన ట్రాఫిక్

వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల నిరసన


30 పడకల ఆసుపత్రిలో మౌనప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం


ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సిబ్బంది నిరసన

నర్సాపూర్(జి), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వైద్య విధాన పరిషత్ (వీవీపీ) ఉద్యోగులు తమ జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ, శాశ్వత పరిష్కారం కోసం శుక్రవారం రాష్ట్ర వ్యాప్త మౌనప్రదర్శనకు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా నర్సాపూర్ 30 పడకల ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పూర్తి సంఘీభావం తెలుపుతూ నిరసనలో పాల్గొన్నారు. కొద్దినెలలుగా (ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకు) ఆలస్యంగా జీతాలు అందుకుంటున్న ఉద్యోగు లు, సెప్టెంబరు జీతం ఇంకా అందకపోవడంతో తీవ్రఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామ న్నారు. తమ ఆవేదనను సున్నితంగా తెలియజేయాలని నిర్ణయించుకున్న సిబ్బంది మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల మధ్య కేవలం 10 నిమిషాల పాటు ఈ మౌన ప్రదర్శన నిర్వహించారు.

పూర్తి సిబ్బంది భాగస్వామ్యం...

నర్సాపూర్ ఆసుపత్రిలోని డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందితో పాటు ఇతర సిబ్బంది కూడా యూనియన్లకు అతీతంగా ప్లకార్డులు పట్టుకుని నిశ్శబ్దంగా నిరసన తెలిపారు. జీతాలు సమయానికి రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈఎంఐలు, అద్దె, పిల్లల ఫీజులు చెల్లించలేకపోతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

రోగుల సేవలకు అంతరాయం లేదు...

ఉద్యోగులు ఇచ్చిన హామీ మేరకు ఈ మౌన ప్రదర్శన కారణంగా ఆసుపత్రి సేవలకు ఎటువంటి అంతరాయం కలుగకుండా ప్రశాంతంగా ముగిసింది. జీతాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, నిరసన ద్వారా తమ సమస్య త్వరగా పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


భైంసాలో..

సకాలంలో వేతనాలు చెల్లించాలి

ఖానాపూర్ : తమకు సకాలంలో వేతనాలు చెల్లించాలని వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట 15 నిమిషాల పాటు వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులంతా మౌనప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... నిరంతరం ప్రజలకు సేవలందించే తమకు వేతనాల చెల్లింపులు ఆలస్యం జరుగుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వంశీ మాధవ్, వైద్యులు మమత, శైలజ, సుధీర్, దివ్య, నర్సింగ్ సిబ్బంది శ్రీనివాస్ చారి, ఆరోగ్య మేరీ, దేవదాయమని, స్వరూప, కిరణ్మయి, మమత, షఫీనా సుల్తానా, వెంకటమ్మ, కావేరి, మంజులలున్నారు.

వేతనాల చెల్లింపులు చేపట్టాలి

భైంసా : కాలయాపనకు తావు లేకుండా ప్రతినెలా ఒకటో తేదీనే తమకు వేతనాల చెల్లింపులు చేపట్టాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ రెగ్యులర్ వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. శుక్రవారం సంబంధిత విషయంలో భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి టీవీవీపీ రెగ్యులర్ ఉద్యోగులు ఉదయం వేళలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఆసుపత్రి ఆవరణలో ప్లకార్డులను చేతబట్టి మౌనప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టీవీవీపీకి చెందిన పలువురు రెగ్యులర్ ఉద్యోగులు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు అందక తాము ఆర్థికపరమైన ఇబ్బందులతో సతమతమవుతున్నామని వెల్లడించారు.

విద్యార్థినులకు అండగా పోలీసు


విద్యార్థినులతో పోలీసు లక్ష్మీ

నిర్మల్ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతపేట్ కేజీబీవీలో శుక్రవారం హాస్టల్ విద్యార్థినులకు పోలీస్ అక్క కార్యక్రమంలో భాగంగా సందర్శించినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ లక్ష్మీ మాట్లాడుతూ... విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్, పాఠశాలల సమస్యలపై, విద్యార్థుల వేధింపుల నివారణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేసి విద్యార్థులతో కలిసి అక్కడే నిద్రించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల సమస్యలను తెలుసుకొని ఎస్పీ దృష్టి తీసుకెళ్లి పరిష్కరిస్తూ విద్యార్థులకు అండగా నిలుస్తున్నట్లు పోలీస్ లక్ష్మీ తెలిపారు.

జిల్లా వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో

రైతుసదస్సు


మాట్లాడుతున్న అంజిప్రసాద్

భైంసా రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం రైతువేదికలో రైతులకు సేంద్రియ ఎరువుల గురించి జిల్లా అధికారి అంజిప్రసాద్ సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులు అధికదిగుబడి రావడానికి తక్కువ మోతాదులో యూరియాను వాడుకోవాలని సూచించారు. దీనివల్ల నేలపై ఆరోగ్యపరంగా ప్రభావం పడుతుందని తెలియజేశారు. సేంద్రియ జీవసమతుల్యా ఎరువుల వినియోగం ద్వారా పంటల ఉత్పాదకత మెరుగుపడుతుందన్నారు. రైతులు నేలలు ఉప్పుదనం నియంత్రణకు విత్తన సమాచారాన్ని కిసాన్ కపాస్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో లక్ష్మీ, వ్యవసాయ అధికారి, రైతులు పాల్గొన్నారు.